RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 114 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | బుధవారం | 28.10.2026 | పేజీలు : 8

కేటీఆర్, హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు : మహేశ్ గౌడ్

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుస్తుందని మహేశ్ గౌడ్ ధీమా
- తెలంగాణలో బీజేపీ పని అయిపోయిందని వ్యాఖ్య
- ఆలోచన లేకుండా అప్పులు చేసి కేసీఆర్ రాష్ట్రాన్ని ముంచారని ఆరోపణ

2



తుమ్మిడిహెట్టి చర్చలు పెద్ద డ్రామా - బాల్క సుమన్

- ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్రంలో కరవు నెలకొందన్న బాల్క సుమన్
- నీళ్లు, కరెంట్ లేక రైతుల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన
- సమస్యలు పరిష్కరించకుండా హరీశ్, కేటీఆర్‌లపై విమర్శలెందుకని ప్రశ్న

2



బడులు పెట్టి చేతులు దులుపుకొంటే సరిపోదు.. రేవంత్ సర్కార్‌పై ఆకునూరి మురళి తీవ్ర విమర్శలు

- విద్యా వ్యవస్థలో లోపాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ ఐఏఎస్
- పిల్లల భద్రతపై ప్రభుత్వానికి నిబద్ధత ఉండాలంటూ వ్యాఖ్యలు
- తెలంగాణ ఫౌండేషన్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్
- విద్యా బడ్జెట్ పెంచాలని, స్కూల్ బస్సులు ఏర్పాటు చేయాలని సూచన

2



ఆర్నబ్ తుపాను

- ఉప్పాడ తీరంలో సముద్రం ఉగ్రరూపం.. రోడ్డుపైకి బండరాళ్లు

- ఆర్నబ్ తుపాను ప్రభావంతో ఉప్పాడ తీరంలో ఎగసిపడుతున్న అలలు
- రక్షణ గోడపై నుంచి రోడ్డుపైకి కొట్టుకొచ్చిన భారీ బండరాళ్లు
- కాకినాడ - ఉప్పాడ బీచ్ రోడ్డులో పూర్తిగా స్తంభించిన ట్రాఫిక్



నిత్యం నిఘా, హైదరాబాద్ : బంగాళాఖాతంలో ఏర్పడిన 'ఆర్నబ్' తుపాను ప్రభావంతో కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో సముద్రం ఉగ్రరూపం దాల్చింది. రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ తీరాన్ని బలంగా తాకుతున్నాయి. అలల..

2

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - సీఎం రేవంత్ రెడ్డి

ప్రణాళికలు వేగవంతం

- హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ వేదికగా డిసెంబర్‌లో సదస్సు
- ప్రపంచ వేదికపై తెలంగాణ ఖ్యాతి: సీఎం రేవంత్ రెడ్డి
- ఏఐ, క్లైమేట్ చేంజ్ దిగ్గజాలకు ఆహ్వానం
- తెలంగాణ సంస్కృతి, కాకతీయ వైభవంతో సదస్సు ప్రాంగణం

నిత్యం నిఘా, హైదరాబాద్ : ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి ఈ నెల 29న ఢిల్లీలో నిర్వహించే కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఈ సదస్సు ఏర్పాట్లపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, జౌత్సాహిక పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలతో సమావేశాలు, రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్ ఈవెంట్ల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సదస్సుతో తెలంగాణ ప్రతిష్ఠ ప్రపంచస్థాయిలో మరింత ఇనుమడిస్తుందని పేర్కొన్న ముఖ్యమంత్రి, నవంబర్ మొదటి వారంలోగా ప్రణాళికలు ఖరారు చేసి విదేశీ, స్వదేశీ సీఈఓలు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. టెక్నాలజీ, ఫార్మా, ఏరోస్పేస్ వంటి రంగాల్లో రాష్ట్ర విజయాలను.....

2



జర్నలిజానికి డేటా చట్టం ముప్పు.. - సుప్రీంకోర్టును ఆశ్రయించిన మీడియా సంస్థలు

- డిజిటల్ డేటా పరిరక్షణ చట్టంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన మీడియా సంస్థలు
- జర్నలిజానికి మినహాయింపులు లేకపోవడంపై తీవ్ర ఆందోళన
- దర్యాప్తు జర్నలిజానికి, సోర్సుల గోప్యతకు ప్రమాదమని పిటిషన్‌లో వాదన
- పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు

2



రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది : కేటీఆర్

- ప్రభుత్వమే కృత్రిమ కరవు సృష్టిస్తోందని కేటీఆర్ ఆరోపణ
- గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని విమర్శ
- మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్య

2



గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా - ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్

- తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీతో నీళ్లు తెస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్
- ప్రస్తుత కరవు కాంగ్రెస్ తెచ్చిన కరవు అని విమర్శ
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు డీపీఆర్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్

2



"ఫ్రీ బస్సు ఎక్కి భార్య వెళ్లిపోయింది".. పథకం రద్దు చేయాలంటూ ఎమ్మెల్యేకు వ్యక్తి వినతి!

- కరీంనగర్ జిల్లా రేగుల పల్లిలో ఘటన
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు సమస్యను వివరించిన కనకయ్య అనే వ్యక్తి
- తనతో గొడవ తర్వాత ఆమె ఫ్రీ బస్సు ఎక్కి వెళ్లిపోయిందని ఆవేదన

నిత్యం నిఘా, కరీంనగర్ : తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకంపై ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. తన భార్య ఫ్రీ బస్సు ఎక్కి వెళ్లిపోయిందని, ఆమె ఆచూకీ తెలియడం లేదని ఎమ్మెల్యే ఎదుట అతడు ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా తన భార్య కనిపించకుండా పోవడానికి ఉచిత బస్సు పథకమే కారణమంటూ దాన్ని రద్దు చేయాలని కోరాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం బెజ్జంకి మండలం రేగులపల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలో జరిగిన ఓ సమావేశానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి కనకయ్య అనే వ్యక్తి తన కుటుంబ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాడు.....

2



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

- సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. చాటేలా నగరవ్యాప్తంగా డ్రోన్లతో సహా విస్తృత ప్రచార ఏర్పాట్లు చేయాలని, క్లైమేట్ చేంజ్, ఏఐ రంగాలకు చెందిన ప్రపంచస్థాయి ప్రముఖులను ఆహ్వానించాలని సూచించారు. ఇక ఏవీజీసీ (AVGC) రంగానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లతో పాటు, రాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించేలా కాకతీయ కళాతోరణం, రామప్ప దేవాలయం నమూనాలు, బతుకమ్మ పండుగ విశేషాలు అతిథులకు తెలిసేలా చేపడుతున్న డిజైన్ల వివరాలను అధికారులు వివరించగా, ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్నబ్ తుపాను

- ఉప్పాడ తీరంలో సముద్రం ఉగ్రరూపం.. రోడ్డుపైకి బండరాళ్లు

మొదటిపేజీ తరువాయి.. ధాటికి సముద్ర తీర రక్షణ కోసం ఏర్పాటు చేసిన భారీ బండరాళ్లు ఎగసిపడి కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డుపై పడ్డాయి. దీంతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ, కోనపాపపేట, సూరడపేట తదితర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. శనివారం రాత్రి నుంచి అలల ఉద్ధృతి కొనసాగుతుండటంతో తీరం వెంబడి పలు ఇళ్లు, చెట్లు దెబ్బతిన్నాయి. ఉప్పాడ తీరానికి సముద్ర కోత అనేది దశాబ్దాలుగా ఉన్న సమస్య. తాజా తుపానుతో ఈ ముప్పు మరింత తీవ్రమైంది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంతాల్లో ప్రత్యేక అధికారుల బృందాలను మోహరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా అందుబాటులో ఉన్నాయి. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. రేపు ఉదయం ఈ తుపాను బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

''ఫ్రీ బస్సు ఎక్కి భార్య వెళ్లిపోయింది''..

పథకం రద్దు చేయాలంటూ ఎమ్మెల్యేకు వ్యక్తి వినతి!

మొదటిపేజీ తరువాయి.. తన భార్యతో గొడవ జరగడంతో ఆమెను మందలించానని, దీంతో ఆమె ఉచిత బస్సు ఎక్కి వెళ్లిపోయిందని కనకయ్య తెలిపాడు. రెండు మూడు రోజులుగా వెతుకుతున్నా ఆమె ఆచూకీ లభించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆమె కోసం వెతకడానికి ఇప్పటికే రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందని చెప్పాడు. తన భార్య కనిపించకుండా పోవడానికి ఉచిత బస్సు పథకమే కారణమని భావిస్తున్నట్లు కనకయ్య ఎమ్మెల్యేకు తెలిపాడు. అందుకే ఆ పథకాన్ని రద్దు చేయాలని కోరాడు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.. మహిళ ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఉచిత బస్సు పథకం వల్ల రాష్ట్రంలో ఎంతోమంది మహిళలు ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు.

బడులు పెట్టి చేతులు దులుపుకొంటే సరిపోదు..

రేవంత్ సర్కార్‌పై ఆకునూరి మురళి తీవ్ర విమర్శలు

మొదటిపేజీ తరువాయి.. ఖమ్మం జిల్లాలో ఐదేళ్ల చిన్నారి ధనశ్రీ మృతి ఘటనపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పిల్లలకు సరైన వసతులు, భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. పిల్లల విద్య, భద్రత విషయంలో ప్రభుత్వానికి అవసరమైన నిబద్ధత కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా కేవీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో విషకీటకం కుట్టడంతో ఐదేళ్ల ధనశ్రీ మృతి చెందిన ఘటనపై మురళి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "సారీ తల్లీ ధనశ్రీ.. నిన్ను ఈ ప్రపంచానికి దూరం చేసుకున్నాం. అన్ని బడుల్లో మంచి వసతులతో కూడిన ప్రీప్రైమరీ తరగతులు, గదులు ఉండి ఉంటే నువ్వు ఈ రోజు బతికి ఉండేదానివి" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల విద్య, భద్రత ప్రభుత్వానికి ప్రాధాన్య అంశాలు కావాలని ఆకునూరి మురళి సూచించారు. కనీస సౌకర్యాలు లేని ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. రాష్ట్రంలోని 60 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా కమిషన్ సిఫార్సుల ప్రకారం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులతో తెలంగాణ ఫౌండేషన్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు విద్యా బడ్జెట్‌ను పెంచాలని, విద్యార్థుల సౌకర్యార్థం స్కూల్ బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తక్షణమే ఐదేళ్ల ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరారు. మరోవైపు, అంగన్‌వాడీ టీచర్ స్థానికంగా ఉండకపోవడం, నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందిందని స్థానికులు ఆరోపించారు. టీచర్‌పై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులతో కలిసి టేకులపల్లి రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ నిరసనకు రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

జర్నలిజానికి డేటా చట్టం ముప్పు..

సుప్రీంకోర్టును ఆశ్రయించిన మీడియా సంస్థలు

మొదటిపేజీ తరువాయి.. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (DPDP) చట్టం, 2023లోని కీలక నిబంధనలు జర్నలిజం మనుగడకే ప్రమాదకరంగా మారాయంటూ దేశంలోని ప్రముఖ మీడియా సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం, మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జర్నలిజానికి ప్రత్యేక మినహాయింపులు ఇవ్వకపోవడం వల్ల దర్యాప్తు కథనాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని, ప్రచురితమైన వార్తలను తొలగించాల్సి వస్తుందని, రహస్య సోర్సుల వివరాలు బయటపెట్టాల్సి వస్తుందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని 21 ప్రముఖ మీడియా సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ (DNPA) ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వ వాదన వినకుండా చట్టంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. పౌరుల హక్కులు, మీడియా హక్కుల మధ్య సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉందని సీజేఐ సూర్యకాంత్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేస్తూ, ఈ అంశంపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్లతో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. DNPA తరఫున సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ, ఈ చట్టం "ముందస్తు సెన్సార్‌షిప్" విధించేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఒక వార్తా కథనం రాయాలంటే, అందులోని వ్యక్తుల అనుమతి కోసం ఎదురు చూడాల్సి వస్తే, ఇక వార్త అనే భావనకే అర్థం ఉండదు. ఈ చట్టం వల్ల న్యూస్ రూమ్‌లు మూతపడతాయి" అని ఆమె కోర్టుకు వివరించారు. గతంలో తీసుకొచ్చిన డేటా పరిరక్షణ చట్టాల ముసాయిదాలలో జర్నలిజానికి మినహాయింపులు ఉండేవని, కానీ తుది చట్టంలో వాటిని తొలగించారని ఆమె గుర్తు చేశారు. చట్టంలోని సెక్షన్ 7, 17(2), 18, 19, 27, 29, 36, 37, 44(3)లతో పాటు, DPDP రూల్స్, 2025లోని 16, 17, 23 నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19(1)(a)లకు విరుద్ధంగా ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ నిబంధనల ప్రకారం, ప్రచురితమైన కథనాలపై వ్యక్తులు అభ్యంతరం తెలిపితే, వారి డేటాను తొలగించాల్సి వస్తుంది. ఇది చారిత్రక రికార్డులను సైతం మార్చే ప్రమాదం ఉందని వారు వాదించారు. అలాగే, సెక్షన్ 36 ప్రకారం, ప్రభుత్వం ఎలాంటి జ్యుడీషియల్ పర్యవేక్షణ లేకుండా మీడియా సంస్థల నుంచి సమాచారం కోరవచ్చని, ఇది రహస్య సోర్సుల గోప్యతకు భంగం కలిగిస్తుందని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.250 కోట్ల వరకు జరిమానా విధించడం చిన్న, ప్రాంతీయ మీడియా సంస్థల మనుగడను ప్రశ్నార్థకం చేస్తుందని తెలిపారు. ఇదే చట్టంలోని సెక్షన్ 44(3) ద్వారా సమాచార హక్కు (RTI) చట్టం, 2005లోని సెక్షన్ 8(1)(j)ని సవరించడాన్ని కూడా పిటిషనర్లు సవాల్ చేశారు. ఈ సవరణ వల్ల, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కూడా వ్యక్తిగత సమాచారాన్ని పొందడం కష్టతరం అవుతుందని, ఇది పారదర్శకతకు గొడ్డలిపెట్టు అని వాదించారు. 2023లో ఆమోదం పొందిన ఈ చట్టానికి సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం 2025లో నోటిఫై చేసింది. 2027 మే నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి రానుంది. జర్నలిజానికి మినహాయింపులు కోరుతూ DNPA ఇప్పటికే కేంద్ర సమాచార, ప్రసార, ఐటీ మంత్రిత్వ శాఖలతో చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈయూ, యూకే, సింగపూర్ వంటి దేశాల్లోని డేటా చట్టాల్లో జర్నలిజానికి స్పష్టమైన మినహాయింపులు ఉన్నాయని పిటిషనర్లు గుర్తుచేశారు. కేంద్రం ఇచ్చే సమాధానం తర్వాత ఈ కేసు విచారణ కీలక దశకు చేరుకోనుంది.

గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా

- ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం సాధ్యమని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, ఒకవేళ నిరూపించలేకపోతే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. గ్రావిటీతో నీళ్లు వస్తాయని ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న కరవుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని హరీశ్ ఆరోపించారు. "ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నా ఎత్తిపోతలు చేపట్టకుండా ప్రభుత్వం రైతులను నష్టపరుస్తోందని విమర్శించారు. 33 శాతం వర్షపాతం లోటు ఉన్న ఏపీలో లేని క్రాప్ హాలిడే, కేవలం 17 శాతం లోటు ఉన్న తెలంగాణలో ఎందుకు ప్రకటించారని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టి, కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారని, అసలు ఆ ప్రతిపాదనకు సంబంధించిన డీపీఆర్‌ను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. తుమ్మిడిహెట్టి వద్ద తగినంత నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం స్పష్టం చేసిన తర్వాతే, తమ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని ఆయన గుర్తుచేశారు.

రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఎత్తిపోయకుండా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో కరవు పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం రైతులను వరి వేయవద్దని చెప్పడాన్ని తప్పు బట్టారు. "రాష్ట్రం ప్రస్తుతం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది" అని కేటీఆర్ మండిపడ్డారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా, రాష్ట్రంలో కరవు ఉంటే ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులకు టెండర్లు పిలుస్తోందని ఎద్దేవా చేశారు. మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలు ఓపిక పట్టాలని కోరారు. అయితే కేటీఆర్ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ఖండించారు. కేటీఆర్ ఐ దొంగ కన్నీళ్లని, గోదావరి జలాలను వృథా చేయడం లేదని, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తక్కువగా ఉన్నందున పంపులను నడపడం సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు.

తుమ్మిడిహెట్టి చర్చలు పెద్ద డ్రామా : బాల్క సుమన్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే పంటలు ఎండిపోతున్నాయని, ఇది ప్రకృతి వైపరీత్యం కాదని, ప్రభుత్వమే సృష్టించిన కరవు అని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ప్రజల దృష్టిని మరల్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రైతులు నీళ్లు, కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం తుమ్మిడిహెట్టి పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందని సుమన్ మండిపడ్డారు. ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వంతో రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జరిపిన చర్చలను ఓ పెద్ద డ్రామాగా అభివర్ణించారు. ఉన్న నీటిని ముందుగానే వదిలేసి, ఇప్పుడు బ్యారేజీ నిర్మిస్తామని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడానికే అని అన్నారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని మాజీ మంత్రి హరీశ్ రావు పూర్తి వివరాలతో నిన్ననే వివరించారని గుర్తు చేశారు. సమస్యపై స్పందించకుండా మంత్రులు కేవలం హరీశ్ రావు, కేటీఆర్‌లను దూషించడం సరికాదని హితవు పలికారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్టులను ఆన్ చేసి ఉంటే సంబంధిత జిల్లాలకు నీరందేదని సుమన్ అభిప్రాయపడ్డారు. నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం గతంలోనే స్పష్టం చేసినప్పుడు, తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రైతుల సమస్యల నుంచి దృష్టి మరల్చడానికే ఈ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్, ఎంత ఆయకట్టుకు లబ్ధి చేకూరుతుంది, అయ్యే ఖర్చు వివరాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కురువ విజయ్ కుమార్, కె. కిశోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్, హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు : మహేశ్ గౌడ్

మొదటిపేజీ తరువాయి.. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు ఇంకా భ్రమల్లోనే జీవిస్తున్నారని, క్షేత్రస్థాయి వాస్తవాలను వారు గ్రహించడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుచుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మేధావి అని చెప్పుకునే కేసీఆర్ ఎలాంటి ఆలోచన లేకుండా అప్పులు చేశారని మహేశ్ గౌడ్ విమర్శించారు. ఎల్ నినో ప్రభావం దేశ వ్యాప్తంగా ఉంటే, దాని గురించి హరీశ్ రావు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, 90,000 ఉద్యోగాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు కాంగ్రెస్‌కే ఓటు వేస్తారని... క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని... దేశంలో ఎక్కడా లేనంతగా తమ పార్టీలో సమన్వయం ఉందని మహేశ్ గౌడ్ తెలిపారు. నవంబర్‌లో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఆ తర్వాత తమ ప్రత్యక్ష లక్ష్యం ఎన్నికలేనని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని, ఆ పార్టీ పని అయిపోయిందని జోస్యం చెప్పారు. ప్రస్తుతం ఉన్న 8 ఎంపీ సీట్లలో రెండు కూడా గెలవడం కష్టమేనని.. మరోవైపు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరు కూడా గెలవరని అన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 40 శాతం సీట్లు తమకే వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పట్టభద్రుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

హన్మకొండ, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): పట్టభద్రుల సమస్యలను తెలుసుకోవడంతో పాటు, వారి హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని జనసేన పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు స్పష్టం చేశారు. హనుమకొండ, వరంగల్ నగర పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి, పలువురు పట్టభద్రులు, ఉద్యోగార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ, రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేసే జనసేన పార్టీకి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అంతకుముందు మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్‌తో పాటు పలువురు స్థానిక మేధావులు, విద్యారంగ నిపుణులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పట్టభద్రుల భవిష్యత్తు, ప్రాంతీయ



సమస్యలు, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై వారితో చర్చించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, ప్రతినిధులు, స్థానిక యువకులు, పట్టభద్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

న్యాయం కోసం బాధితుల ఆవేదన

- **రూ.85 లక్షల ఇంటిపై వివాదం.. రూ.39 లక్షలకే దక్కించుకునే యత్నం?**

పెద్దపల్లి జిల్లా/ మంథని, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): కష్టపడి నిర్మించుకున్న ఇంటిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని మంథనికి చెందిన బండం చంద్రశేఖర్, సుప్రియ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అగ్రిమెంట్, బ్యాంకు వేలం ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని వారు కోరారు. మంగళవారం మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు తమ సమస్యలను వెల్లడించారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తన ఇంటి విలువ రూ.85 లక్షలుగా పేర్కొంటూ అగ్రిమెంట్ చేసుకున్నారని, అందులో రూ.10 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించినట్లు చూపించారని తెలిపారు. అయితే తనకు ఎలాంటి అడ్వాన్స్ అందలేదని, మిగిలిన మొత్తాన్ని కూడా చెల్లించలేదని ఆరోపించారు. మరోవైపు, తనకు నోటీసులు ఇవ్వకుండానే ఆ ఇంటిని బ్యాంకు ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా రూ.39 లక్షలకు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు.2015–2017 మధ్య సోలార్ కంపెనీలో పనిచేసిన సమయంలో కార్మికుల పీఎఫ్ వివాదానికి సంబంధించి తనపై కేసు నమోదైందని చంద్రశేఖర్ తెలిపారు. పెద్దల సమక్షంలో జరిగిన పంచాయితీలో రూ.5 లక్షలు చెల్లించినప్పటికీ కేసు ఉపసంహరించుకోలేదని, అనంతరం పోలీసులు కేసును కొట్టివేసినట్లు వెల్లడించారు.2021లో ఇంటి స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్నట్లు తెలిపారు. ఇంటిపై తీసుకున్న రుణానికి ఈఎంఐలు చెల్లించలేక



పోవడంతో ఫైనాన్స్ సంస్థ ఇంటిని సీజ్ చేసిందని వివరించారు. ఈ పరిస్థితుల్లో ఇంటి అగ్రిమెంట్, రుణ బకాయిలు, వేలం ప్రక్రియకు సంబంధించి పలు సందేహాలు తలెత్తాయని అన్నారు.ఆకుల కిరణ్ తనను బెదిరించినట్లు చంద్రశేఖర్ ఆరోపించారు. తన తమ్ముడు ఆకుల సంజీవ్ పేరుతో ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా ఇంటిని రూ.39 లక్షలకు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ అందుబాటులో లేదు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో పల్లవి విద్యార్థుల ప్రతిభ..జాతీయ బరిలో సింధు

- **సాఫ్ట్‌బాల్, నెట్‌బాల్, గట్కాలో సత్తా చాటిన 12 మంది విద్యార్థులకు ఘన సన్మానం**

వరంగల్ / పర్వతగిరి, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తెచ్చిన అన్నారం పల్లవి హైస్కూల్ విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానం నిర్వహించారు. సోమవారం పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్, నెట్‌బాల్, గట్కా క్రీడా విభాగాల్లో ప్రతిభ చాటిన 12 మంది విద్యార్థులను అభినందించారు. అండర్–13 జాతీయ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌కు తెలంగాణ బాలికల జట్టు తరఫున ఎంపికైన డి.ఎస్. సింధును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సింధు, నిజామాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ తన ప్రతిభను చాటుకుంది. వరంగల్ జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించి, తెలంగాణ జట్టులో చోటు సంపాదించింది. మహారాష్ట్రలోని షిరిడీలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఆమె అక్టోబర్ 28న తెలంగాణ జట్టుతో కలిసి బయలుదేరనుంది.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక చారి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన విజయానికి పునాదులని పేర్కొన్నారు. సింధు జాతీయస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రానికి, వరంగల్ జిల్లాకు, పర్వతగిరి మండలానికి, అన్నారం గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు.ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి టోర్నమెంట్లలో సాఫ్ట్‌బాల్ విభాగంలో వరంగల్ జిల్లా బాలికల జట్టు,



నెట్‌బాల్ విభాగంలో మహబూబాబాద్ జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానాలు సాధించడంలో పల్లవి విద్యార్థులు భాగస్వాములయ్యారు. గట్కా విభాగంలోనూ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థులకు శిక్షణ అందించి, వారి విజయాలకు కృషి చేసిన పీఈటీ శ్రవణ్ కుమార్, కోచ్ కవితను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్, ప్రిన్సిపాల్ ఎం. అశ్విని, కోఆర్డినేటర్లు రాజు, నవ్యశ్రీ, వకుళాదేవి, పీఈటీ శ్రవణ్ కుమార్, కోచ్ కవిత, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్య మహిళా క్లినిక్‌లో వైద్య సేవలపై సమీక్ష

- **పర్వతగిరి పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి**

వరంగల్ / పర్వతగిరి, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లినిక్‌ను వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి తనిఖీ చేసి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించారు. మహిళలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి సూచించారు.తనిఖీలో భాగంగా క్లినిక్‌లోని ఔట్ పేషెంట్ (ఓపీ) రిజిస్టర్, ల్యాబొరేటరీ రిజిస్టర్‌తో పాటు ఐస్‌లైన్డ్ రిఫ్రిజిరేటర్ (ఐఎల్ఆర్)ను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, ప్రయోగశాల సేవలు, టీకాల నిల్వకు సంబంధించిన కోల్డ్ చైన్ నిర్వహణ తీరును తనిఖీ చేశారు.ఆరోగ్య మహిళా క్లినిక్‌కు వచ్చే మహిళలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన వైద్య పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని, అన్ని రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య మహిళా కార్యక్రమానికి సంబంధించిన పనితీరు సూచికలను సమీక్షిస్తూ, ప్రతి అంశంలో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించేందుకు వైద్యాధికారులు,



సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ బి. రాజా రెడ్డి సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.ఈ తనిఖీలో పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ వి. ఉదయ్ రాజ్, డాక్టర్ జె. మౌనిక, నర్సింగ్ ఆఫీసర్ కె. రాజిత, ల్యాబ్ టెక్నీషియన్ రాజుతో పాటు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగొద్దు



ఏటూరునాగారం, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ డీఈ పురుషోత్తం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (O&M) సిబ్బందికి సూచించారు.మంగళవారం ఏటూరునాగారం సబ్‌స్టేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తుఫాన్ ప్రభావంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి సరఫరాను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించేలా సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈ సమావేశంలో ఏఈ శేఖర్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, లైన్‌మెన్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో ఆర్టీఐ సమన్వయ కమిటీ ఏర్పాటు



ములుగు జిల్లా , అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): సమాచార హక్కు చట్టం–2005 అమలును మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ములుగు జిల్లాలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అక్టోబర్ 24న ప్రొసీడింగ్స్ నంబర్ B3/785/2026 ద్వారా ఆదేశాలు వెలువడ్డాయి.ఈ కమిటీకి జిల్లా రెవెన్యూ అధికారి వి. రవికుమార్ నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రతినిధులు, ఆర్టీఐ కార్యకర్తలకు కూడా కమిటీలో స్థానం కల్పించారు. ఇందులో భాగంగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ములుగు జిల్లా అధ్యక్షుడు పి. ముఖేష్, ఆర్టీఐ కార్యకర్త గొల్కొండ రాజు సభ్యులుగా నియమితులయ్యారు.జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలు తీరును సమీక్షించేందుకు ప్రతి మూడు నెలలకోసారి త్రైమాసిక సమావేశాలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చట్టం అమలుకు అవసరమైన చర్యలు చేపట్టడంతోపాటు, సమీక్షా సమావేశాల్లో చర్చించిన అంశాలు, వాటి అమలు తీరుపై ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాల్సి ఉంటుంది.ప్రభుత్వ శాఖల్లో సమాచార హక్కు చట్టం అమలు తీరును పర్యవేక్షించడం, పాలనలో పారదర్శకతను పెంపొందించడం, ప్రజలకు సమాచారాన్ని పొందే హక్కు సక్రమంగా అందేలా చూడటం ఈ కమిటీ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ కమిటీ ఏర్పాటు ద్వారా జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలు మరింత పటిష్టం కానుందని భావిస్తున్నారు.

పెంచికల్‌పేట్‌లో తక్కువ వోల్టేజీసమస్యకు చెక్



పెద్దపల్లి జిల్లా / కమాన్‌పూర్, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేట్ గ్రామంలోని 1, 2వ వార్డుల్లో నెలకొన్న తక్కువ వోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఆయా వార్డుల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను గ్రామ సర్పంచ్ పల్లె మాధవి నారాయణ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నూతన డీటీఆర్ (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్) ఏర్పాటు చేయించారు.గ్రామంలోని రెండు వార్డుల్లో తక్కువ వోల్టేజీ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సర్పంచ్ విద్యుత్ శాఖ అధికారులకు వివరించి, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. స్పందించిన అధికారులు నూతన డీటీఆర్‌ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె మాధవి నారాయణ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు విద్యుత్ సరఫరా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మొదటి వార్డు సభ్యురాలు పిడుగు స్వప్న, రెండో వార్డు సభ్యుడు దొంతుల అఖిల్, విద్యుత్ శాఖ ఏఈ స్వామి, ఎస్ఎల్ఐ కృష్ణ, ఎల్ఐ సత్యనారాయణ రావు, లైన్‌మెన్ నాగరాజు, ఏఎల్ఎం చంద్రమౌళి, అన్‌మన్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

79 మార్కులతో సుల్తానాబాద్ సహకార సంఘం రికార్డు



పెద్దపల్లి జిల్లా, సుల్తానాబాద్, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పనితీరుపై నిర్వహించిన మూల్యాంకనంలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ సింగిల్ విండో 79 మార్కులు సాధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. రైతులకు మెరుగైన సేవలు అందించడం, సంఘ నిర్వహణలో ఉత్తమ ప్రమాణాలు పాటించడం ద్వారా ఈ గుర్తింపు లభించిందని సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సంఘ సీఈవో బూర్గు సంతోష్, పాలకవర్గ సభ్యులు తెలిపారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పనితీరును మూల్యాంకనం చేయగా సుల్తానాబాద్ ప్యాక్స్ 79 మార్కులతో అగ్రస్థానంలో నిలిచిందని వారు పేర్కొన్నారు. రైతులకు సకాలంలో రుణాలు అందించడం, ఎరువులు, విత్తనాల సరఫరాను సమర్థవంతంగా నిర్వహించడం, ధాన్యం సేకరణలో పారదర్శకత పాటించడం వంటి అంశాల్లో సంఘం ప్రతిభ కనబరిచిందన్నారు. వ్యాపార వైవిధ్యీకరణ, రుణాల వసూళ్లు, డిజిటలైజేషన్, మెరుగైన నిర్వహణ ప్రమాణాల అమలు కూడా ఈ గుర్తింపునకు దోహదపడ్డాయని వివరించారు.ఈ సందర్భంగా శ్రీగిరి శ్రీనివాస్, బూర్గు సంతోష్ మాట్లాడుతూ.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్యాక్స్‌లలో సుల్తానాబాద్ సహకార సంఘం 79 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. రైతుల నమ్మకం, పాలకవర్గ సభ్యుల సహకారం, సంఘ సిబ్బంది నిరంతర కృషి వల్లే ఈ గుర్తింపు సాధ్యమైందని తెలిపారు.భవిష్యత్తులో రైతులకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. సంఘ అభివృద్ధికి సహకరించిన అధికారులు, సిబ్బంది, రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.సుల్తానాబాద్ సహకార సంఘానికి గుర్తింపు లభించడంపై సంఘ సభ్యులు, స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ చైర్మన్, సీఈవో, పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో రక్తదాన శిబిరం

- స్వచ్ఛందంగా రక్తదానం చేసిన మిల్స్ కాలనీ ఎస్‌హెచ్‌ఓ కె. స్వామి, ఇన్‌స్పెక్టర్ మంగీలాల్
- రక్తదాతలను అభినందించిన వరంగల్ ఏసీపీ





వరంగల్, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా వరంగల్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కె. స్వామి, ఇన్‌స్పెక్టర్ మంగీలాల్‌తో పాటు పోలీస్ స్టేషన్ పరిధిలోని పలువురు స్థానికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ఈ సందర్భంగా వరంగల్ ఏసీపీ రక్తదానం చేసిన పోలీసు అధికారులను, ఇతర రక్తదాతలను అభినందించారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందని, ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించడం ద్వారా సమాజానికి సేవ చేయాలనే సందేశాన్ని అందించారు.

మహిళల భద్రతపై షీ టీమ్ అవగాహన సదస్సు

పెద్దపల్లి జిల్లా, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి):మహిళలు, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, వేధింపుల నివారణపై అవగాహన కల్పించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ సభ్యులు రంగంపల్లిలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ ఎం. లావణ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళల భద్రత, సైబర్ నేరాలు, బాలల రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ.. విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. లైంగిక నేరాల నుంచి బాలలను రక్షించే పోక్సో చట్టం గురించి వివరించారు. సామాజిక మాధ్యమాల ప్రభావం, విద్యార్థుల ప్రవర్తన, యుక్తవయసులో కలిగే శారీరక, మానసిక మార్పులు, ఆ దశలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రత, అంతర్జాల మోసాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాల గురించి వివరించారు.మహిళల రక్షణ కోసం షీ టీమ్‌లు ప్రతిరోజూ బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, కళాశాలల వద్ద నిఘా కొనసాగిస్తాయని తెలిపారు. మహిళలు, విద్యార్థులు ఎవరైనా వేధింపులకు గురైతే భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.మహిళలకు ప్రమాదం ఎదురైనా, ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా వెంటనే



100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని తెలిపారు. ప్రయాణ సమయంలో మహిళల భద్రత కోసం టి-సేఫ్ (T-Safe) యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శిక్షణ సంస్థ సంచాలకుడు సీహెచ్. వెంకటేష్, మల్లయ్య, షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ మద్దతు

వరంగల్, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో చేపట్టిన సమ్మెకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్టీ వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గరిగె సుమతి నాయకత్వంలో పార్టీ నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల ఇబ్బందులను నిర్లక్ష్యం చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల సంపత్ పటేల్ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని





అందజేసి, తమ డిమాండ్ల పరిష్కారానికి సహకరించాలని కోరారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ వారికి అండగా ఉంటుందని, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని గరిగె సుమతి, పెండ్యాల సంపత్ పటేల్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కూచన సునీత, దాసరి శ్రీదేవి, రాచర్ల రచన, ఉమా, భార్గవితో పాటు పలువురు పాల్గొన్నారు.

కొమరం భీమ్ వర్ధంతి సందర్భంగా ఆదివాసీల నిరసన గళం

ములుగు జిల్లా / వాజేడు, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆదివాసీల హక్కులను కాపాడాలని, పెనుగోలు గ్రామంలో సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆదివాసి నవనిర్మాణ సేన (ఏఎన్ఎస్) నాయకులు డిమాండ్ చేశారు. కొమరం భీమ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం వాజేడు మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వాజేడు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఎన్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలం నుంచి పెనుగోలు గ్రామంలో నివసిస్తున్న ఆదివాసీ కుటుంబాలు తమ భూములను నమ్ముకొని జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. గతంలో కనీస వైద్య సదుపాయాలు కూడా లేక పోయినా, భూముల్లో పండించిన పంటలతో జీవనం సాగించామని పేర్కొన్నారు. అయితే, తమ భూములకు పూర్తిస్థాయిలో పట్టాలు మంజూరు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు.గతంలో నిర్వహించిన భూసర్వేలో కొంతమందికి మాత్రమే పట్టాలు ఇచ్చి, అందరికీ ఇచ్చినట్లు అధికారులు వ్యవహరించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాము సాగు చేసుకుంటున్న భూములను అటవీ శాఖకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.గ్రామస్థులకు సమాచారం ఇవ్వకుండా, పీసా గ్రామసభ నిర్వహించకుండానే రెవెన్యూ, అటవీ, ఇరిగేషన్ అధికారులు పెనుగోలు గ్రామంలో భూసర్వే నిర్వహించేందుకు ప్రయత్నించారని ఏఎన్ఎస్ నాయకులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఏఎన్ఎస్ సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్ కుమార్, ఇతర నాయకులు, గ్రామస్థులు అక్కడికి చేరుకుని సర్వేను అడ్డుకున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వాజేడు మండలం ఐదో షెడ్యూల్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమని,



ఇక్కడ 1/70 చట్టం, పీసా చట్టం అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. చట్టపరమైన నిబంధనలు, గ్రామసభ ప్రక్రియలను పాటించకుండా భూసర్వేలు చేపట్టడం సరికాదని అన్నారు. దీంతో అధికారులు వెనుదిరిగినట్లు తెలిపారు.పెనుగోలు గ్రామంలో ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని, భూముల విషయంలో గ్రామస్థుల హక్కులను పరిరక్షించాలని తహసీల్దార్‌కు సమర్పించిన వినతిపత్రంలో కోరారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఏఎన్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భూములపై హక్కులు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్, రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్, వాజేడు మండల కార్యదర్శి తల్లడి ప్రసాద్, యలం అశోక్, తల్లడి నానబాబు, నాయకులు పాయం శివ, బొగ్గుల నారాయణ, శంకర్, రాంబాబు, రాజేష్, రమేష్, సూరితో పాటు జానకి, కమల, సమ్మక్క, సారక్క, సావిత్రి, సతీష్, పెనుగోలు గ్రామస్థులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

దళారుల మాయలో పడొద్దు.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలనే వినియోగించుకోండి

పెద్దపల్లి జిల్లా/ సుల్తానాబాద్, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): రైతులు దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు సూచించారు. రైతులకు సాగునీరు అందించడంతో పాటు, వారి పంటలకు మద్దతు ధర కల్పించే విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పనిచేస్తున్నామని తెలిపారు.మంగళవారం సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ప్రజాప్రతినిధు లతో కలిసి విజయరమణారావు ప్రారంభం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఒప్పించి పది రోజుల పాటు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయించి రైతుల పంటలను కాపా డామని పేర్కొన్నారు.రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ, మార్కెట్ ధరలను తగ్గించే ప్రయత్నాలతో వారిని ఇబ్బందులకు గురిచేసే దళారుల ఆగడాలను అడ్డుకునేం దుకే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభి స్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులకు క్వింటాకు రూ.2,462 మద్దతు ధర లభిస్తుం దని, సన్నధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తుండటంతో మొత్తం రూ.2,962 పొందే అవకాశం ఉందని వివ రించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బయట మార్కెట్‌లో అధిక ధర లభిస్తే అక్కడ ధాన్యం విక్రయించుకునే స్వేచ్ఛ రైతులకు ఉందని స్పష్టం చేశారు.కొనుగోలు కేంద్రాల్లో తూకం విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సంబంధిత కేంద్రాల ఇన్‌చార్జీలపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వారిని బాధ్యతల నుంచి తొలగిస్తామని హెచ్చరిం చారు. తుఫాను ప్రభావం నేపథ్యంలో కోసిన ధాన్యం తడవకుండా పాలిథిన్ కవర్లతో కప్పి



భద్రపరచుకోవాలని రైతులకు సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశాలున్నందున యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించు కుంటూ పంట నష్టాలను నివారించుకోవాలని సూచించారు. రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సంక్షేమమే లక్ష్యంగా పనిచే స్తానని విజయరమణారావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కనుకుల సింగిల్ విండో చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు



ఏటూరునాగారం, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశా లను అందిపుచ్చుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు.మంగళవారం ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన యువత కోసం నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన గోడపత్రిక లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పరిధిలోని ఐదు యువజన శిక్షణ కేంద్రాల్లో అందిస్తున్న వివిధ కోర్సులపై గిరిజన యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.శిక్షణ సమయంలో అభ్యర్థులకు యూనిఫాం, స్టడీ మెటీరియల్‌తో పాటు భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.గిరిజన యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అంది పుచ్చుకోవాలని పీఓ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పి. హరి ప్రసాద్, జేడీఎం కొండల్ రావు, యువజన శిక్షణ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నరకాసుర వధ ఉత్సవాలకు భారీ పోలీస్ బందోబస్తు

వరంగల్, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్‌లోని ఉర్సు గుట్ట సమీపంలోని మైదానంలో నవంబర్ 6న నిర్వహించ నున్న నరకాసుర వధ ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా సభా ప్రాంగణంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని మిల్స్ కాలనీ ఎస్‌హెచ్‌ఓ కర్రె స్వామి తెలిపారు.మంగళవారం నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు ఎస్‌హెచ్‌ఓ కర్రె స్వామిని కలిసి వినతిపత్రం, ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ, కార్య క్రమాల వివరాలను ఆయనకు వివరించారు. అనంతరం మిల్స్ కాలనీ సీఐ మంగీలాల్‌కు సైతం వినతిపత్రం అందజేశారు.నవం బర్ 6న సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, రాత్రి 9 గంటలకు నరకాసుర వధ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి తెలిపారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొండా సురేఖ, కొండా మురళీధర్‌రావుతో పాటు ప్రజాప్రతినిధులు, అధి కారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతారని వివరించారు.ఉత్స వాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన పోలీస్



బందోబస్తు ఏర్పాటు చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు.ఈ కార్యక్రమంలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మరుపల్ల గౌతమ్, దూడబోయిన బాలకొమురెల్లి, వనం కుమార్, శెట్టి మోహన్, తౌటం నరసింహ, మాటేటి శ్యామ్, కుండే రాజు, కుండే సదానందం, గౌడ కోటేశ్వర్, బలభద్ర, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు దోమల మందు పిచికారీ



ములుగు జిల్లా/వాజేడు,అక్టోబర్ 27(నిత్యం నిఘా ప్రతినిధి): వర్షాకాలం అనంతరం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమల బెడద నుంచి గ్రామ ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ బోదెబోయిన భరత్ కుమార్ నేతృత్వంలో గ్రామపంచాయతీ పరిధిలోని ఇప్పగూడెం గ్రామంలో ఇంటింటికీ దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామాల్లో దోమల వ్యాప్తి పెరిగితే ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఈ కార్యక్ర మాన్ని చేపట్టారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పును తగ్గించేందుకు ఇళ్ల పరిసరాలతో పాటు దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్న ప్రాంతాల్లో మందు పిచికారీ చేశారు.గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వ్యాధులు వ్యాప్తి చెందకముందే నివారణ చర్యలు చేపట్టడం అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతతో పాటు దోమల నియంత్రణకు ప్రజలు కూడా సహకరించాలని సూచించారు.ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని తగ్గించవచ్చని తెలిపారు.

పెనుగోలు ఆదివాసీల భూములకు పట్టాలు జారీ చేయాలి

ములుగు జిల్లా/వాజేడు, అక్టోబర్ 27(నిత్యం నిఘా ప్రతినిధి):వా జేడు మండలం పెనుగోలు గ్రామ ఆదివాసీలు వందల ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు జారీ చేయాలని ఆదివాసీ సంఘాల జాక్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీల సాగు భూములను మోడీ కుంట ప్రాజెక్టుకు కేటాయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పెసా గ్రామసభల ఆమోదం లేకుండా భూసేకరణ చేపట్టడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.మంగళవారం వీరభద్రవరంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీని ఆదివాసీ జాక్ నాయకులు పూనెం సాయి, కొర్స నర్సింహామూర్తి, యాసం రాజు, వాసం నాగరాజు కలిసి వినతిపత్రం అందజేశారు. పెనుగోలు గ్రామానికి చెందిన ఆదివాసీ రైతులు కూడా అదనపు కలెక్టర్‌ను కలిసి తమ సమస్య లను వివరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో గుట్టల మధ్య ఉన్న పెనుగోలు గ్రామ ప్రజలు వందల ఏళ్లుగా అడవులు, గుట్టలను నమ్ముకొని తమ భూముల్లో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇన్నేళ్లుగా సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వకుండా పాలకులు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు.విద్య, వైద్య సదుపాయాలకు దూరంగా ఉన్నప్పుడు పట్టించుకోని ప్రభుత్వానికి ఇప్పుడు ప్రాజెక్టు కోసం పెనుగోలు గ్రామ భూములు గుర్తుకొచ్చాయా అని ప్రశ్నించారు. ఆదివాసీల హక్కులను పరిరక్షించే 1/59, 1/70 చట్టాలు, పెసా చట్ట నిబంధ నలను గౌరవించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు తమ ఇష్టానుసారంగా ఆదివాసీల సాగు భూములను, ప్రభుత్వ భూములను ఇతర శాఖలకు కేటాయించడం సరికాదని పేర్కొన్నారు.ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకున్న వలస గిరిజనేతరుల ఆధీనంలోని భూములను గుర్తించి, నిబంధ



నల ప్రకారం వాటిని ప్రాజెక్టులకు కేటాయించాలని వినతిపత్రంలో కోరినట్లు నాయకులు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న రెవెన్యూ భూముల రీ-సర్వేలోనూ అక్రమ ఆక్రమణలను గుర్తించి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరినట్లు వెల్లడించారు.పెసా గ్రామసభల ఆమోదం లేకుండా ప్రాజెక్టుల కోసం భూములు సేకరించడం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు. ఆదివాసీల సాగు భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తే ప్రత్యక్ష ఆందో ళనలకు దిగుతామని హెచ్చరించారు.పాములూరు, డోలి, జెల్లా, చెలిమల గ్రామాలకు రహదారి సదుపాయం కల్పించిన విధంగానే పెనుగోలు గ్రామానికి కూడా రహదారి నిర్మించాలని, గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం ప్రతాప్, ఎట్టి విద్యాసాగర్, కుంజ మహేష్, కంతి వెంకటకృష్ణ, కంతి విజయ్, పాయం అజయ్, వాసం నారాయణ, మహిళా నాయకులు ముర్రం రామలక్ష్మి, పద్మ, చిలకమ్మతో పాటు పెనుగోలు గ్రామ ఆది వాసీలు పాల్గొన్నారు.

ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం కార్యని ర్వాహక అధ్యక్షుడిగా గడదాసు సునీల్ కుమార్



ఏటూరునాగారం, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): ఉమ్మడి వరంగల్ జిల్లా ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఏటూరునాగారానికి చెందిన మయూరి ఫోటో స్టూడియో నిర్వాహకుడు గడదాసు సునీల్ కుమార్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు.మంగళవారం హనుమ కొండలోని సి.పి. రెడ్డి కాంప్లెక్స్‌లో ఉన్న జిల్లా సంఘ కార్యాలయంలో నూతన పాల కవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించింది. ఇటీవల నిర్వహించిన జిల్లా సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన ప్రతినిధు లకు ఈ సందర్భంగా బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా సంఘ ఆర్థిక బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి నిబద్ధతతో కృషి చేస్తూ విశేష సేవలందించిన గడదాసు సునీల్ కుమార్‌కు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.ఏటూరునాగారం మండలం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా సంఘంలో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పదవి దక్కడం విశేషమని పలువురు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతన కార్యనిర్వాహక అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తికి, తన నియామకానికి సహకరించిన సంఘ పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘ ఆర్థిక బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పట్టభద్రుల ఓటరు నమోదుపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి



వరంగల్ జిల్లా/వర్ధన్నపేట, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు కావాలని వర్ధన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రాధాన్యాన్ని వివరిస్తూ పట్టణంలోని 5, 6వ డివిజన్ల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఈగ దామోదర్ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరుగా నమోదు కావడం తప్పనిసరి అని తెలిపారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించే ప్రతినిధిని ఎన్నుకోవడంలో ప్రతి ఓటు కీలకమని పేర్కొన్నారు. అర్హత ఉన్నప్పటికీ ఓటరుగా నమోదు కాకపోతే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని, అందువల్ల పట్టభద్రులు నిర్లక్ష్యం చేయకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అర్హులైన వారు నిర్దేశిత దరఖాస్తు ఫారం, విద్యార్హత ధ్రువపత్రాలు, అవసరమైన ఇతర పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం ప్రకటించిన గడువులోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు ఓటరు జాబితాలో తమ పేరు నమోదైందో లేదో పరిశీలించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పులి శ్రీనివాస్, ఎం.డి. సోహెల్, విలాసారపు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి వార్షికోత్సవంలో గుండు సుధారాణి ప్రభాకర్ దంపతుల ప్రత్యేక పూజలు





వరంగల్, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): భూలక్ష్మి, శ్రీలక్ష్మి, పోతరాజు సహిత బొడ్రాయి గ్రామదేవతల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జీడబ్ల్యూఎంసీ మాజీ మేయర్ గుండు సుధారాణి ఆకాంక్షించారు.వరంగల్‌లోని రామన్నపేట, పాపయ్యపేట ప్రాంతాల్లో బొడ్రాయి గ్రామదేవతల తొమ్మిదో వార్షికోత్సవాన్ని మంగళవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేదబ్రాహ్మణుడు కురవి రాజేష్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, హోమాలు, బోనాల పండుగ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గుండు సుధారాణి, ప్రభాకర్ దంపతులు పాల్గొని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ.. రామన్నపేట, పాపయ్యపేట ప్రజల సహకారంతో 2017లో భూలక్ష్మి, శ్రీలక్ష్మి, పోతరాజు సహిత బొడ్రాయి గ్రామదేవతలను ప్రతిష్ఠించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం వార్షికోత్సవం సందర్భంగా గ్రామదేవతలకు అభిషేకాలు, హోమాలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.గ్రామదేవతల ఆశీస్సులు, అనుగ్రహం రామన్నపేట, పాపయ్యపేట ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో తోనుపునూరి వీరన్న, బొమ్మ సురేష్, ఓరుగంటి పూర్ణ, శ్రీరాముల సురేష్, రుద్ర శ్రీనివాస్, తాళ్లపల్లి సంతోష్, ఎల్ఐసీ శ్రీనివాస్, గొల్ల రాజయ్య, శివపురం లోకేష్, నల్ల సత్యంతో పాటు ఆర్పీలు, మహిళలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అర్నాబ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సిద్ధం

- **భద్రాచలం డివిజన్‌లోని సమస్యాత్మక ప్రాంతాల్లో సహాయక చర్యలకు ఏర్పాట్లు**
- **భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ**



భద్రాచలం, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో భద్రాచలం డివిజన్‌లోని సమస్యాత్మక మండలాల ప్రజలకు సహాయక చర్యలు అందించేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని అందుబాటులో ఉంచినట్లు భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ తెలిపారు.మంగళవారం సాయంత్రం కొత్తగూడెం సమీపంలోని చాతకొండ నుంచి వచ్చిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఎన్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులతో సమావేశమై భద్రాచలం డివిజన్‌లోని సమస్యాత్మక మండలాలు, గ్రామాల పరిస్థితులపై వివరించారు. తుఫాన్ ప్రభావంతో అత్యవసర పరిస్థితులు తలెత్తితే చేపట్టాల్సిన సహాయక చర్యలపై వారికి సూచనలు చేశారు.అవసరమైన సమయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందానికి సహకారం, సమన్వయం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండి, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చాతకొండ నుంచి వచ్చిన 22 మంది ఎన్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం.. వేసంగి వరి సాగుకు నీరు ఇవ్వొద్దు

- **తాలిపేరు ప్రాజెక్టు నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలి**
- **ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**



భద్రాచలం, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి):ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తాలిపేరు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో వేసంగి వరి సాగుకు నీటిని విడుదల చేయవద్దని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అధికారులకు సూచించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు.మంగళవారం భద్రాచలంలోని తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు, తాలిపేరు ప్రాజెక్టులో నీటి లభ్యత, రానున్న వేసంగి పంటల సాగుపై చర్చించారు.ఈ ఏడాది నీటి కొరత ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాలిపేరు ఆయకట్టు పరిధిలో వేసంగి వరి సాగు చేయడం సాధ్యం కాదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.కరువు పరిస్థితుల్లో పశువులను కాపాడుకోవడం కూడా ముఖ్యమని తెలిపారు. రైతులు పశుగ్రాసం, సజ్జలు, జనుములు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారులు తగిన సూచనలు అందించి, రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా వేసంగి వరి పంటకు నీటిని విడుదల చేయకుండా, తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని వినియోగించేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే వేసంగి వరి సాగుకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వ శాఖల ద్వారా సరఫరా చేయకుండా చూడాలని, ప్రైవేటు విత్తన కంపెనీలు కూడా వరి విత్తనాలను సరఫరా చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.రైతులు ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సూచించారు.

ఆయిల్‌ఫామ్ రైతులూ.. అప్రమత్తంగా ఉండండి

- **శాస్త్రీయ సాగు పద్ధతులు పాటించాలి: మండల ఆయిల్‌ఫామ్ కమిటీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి సత్యనారాయణ రావు**



వరంగల్ జిల్లా/వర్ధన్నపేట, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి):ఆయిల్‌ఫామ్ సాగులో రైతులు నిర్లక్ష్యానికి తావివ్వకుండా, ఉద్యానవన శాఖ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ తోటలను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని మండల ఆయిల్‌ఫామ్ కమిటీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి సత్యనారాయణ రావు సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఆయిల్‌ఫామ్ రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.
మండలంలోని కొత్తపల్లి, ల్యాబర్తి గ్రామాల్లో ఏడుగురు రైతులకు చెందిన 51 ఎకరాల ఆయిల్‌ఫామ్ తోటలను మంగళవారం మండల ఆయిల్‌ఫామ్ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తోటల నిర్వహణ, చెట్ల పెరుగుదల, సాగు పద్ధతులు, వాతావరణ మార్పులతో పంటపై పడే ప్రభావాలను వివరించారు. ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.

ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తత అవసరం

మారుతున్న వాతావరణ పరిస్థితులు ఆయిల్‌ఫామ్ సాగుపై చూపే ప్రభావాలను వివరించిన కమిటీ సభ్యులు, తోటల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలుపు నివారణకు రైతులు వినియోగిస్తున్న యంత్రాలను పరిశీలించి, సాగులో యాంత్రీకరణ ప్రాధాన్యాన్ని వివరించారు. అధికారుల సూచనల మేరకు పంట నిర్వహణ చేపడితే నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా రైతులు తమ సమస్యలను కమిటీ సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. డ్రిప్ సిస్టమ్ ఏర్పాటు, నిచ్చెనలపై సబ్సిడీ, ఆయిల్‌ఫామ్ తోటల మీదుగా వెళ్తున్న విద్యుత్ స్తంభాల తొలగింపు, ఉచిత సోలార్ సిస్టమ్‌ల ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు.

రైతులకు అండగా ఆయిల్‌ఫామ్ కమిటీ

ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించడం, క్షేత్రస్థాయిలో వారి సమస్యలను తెలుసుకోవడం, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ పర్యటన నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎర్రం నాగరాజు, ముసుకుంట్ల ఐలయ్య, బలరాం, టి. వెంకటేశ్వర్ రావుతో పాటు కొత్తపల్లి, ల్యాబర్తి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి? 420 హామీల అమలేది?

వరంగల్ జిల్లా / వర్ధన్నపేట, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ మార్కెట్ చైర్మన్, సీనియర్ తెలంగాణ ఉద్యమకారుడు గుజ్జ సంపత్‌రెడ్డి డిమాండ్ చేశారు. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర హామీల అమలుపై ప్రశ్నలు లేవనెత్తారు.

ఉద్యోగాల భర్తీపై స్పష్టత ఏది?

ఏటా రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని సంపత్‌రెడ్డి కోరారు. నిరుద్యోగులు, పట్టభద్రులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి చూపాలని అన్నారు. ఉద్యోగుల పెండింగ్ డీఏలు, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సమస్యలపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

రైతులకు అవసరమైన విద్యుత్, సాగునీరు, ఎరువుల సరఫరా, పంటల కొనుగోలు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, సాగునీటి నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, మహిళలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు జవాబు చెప్పాలని పేర్కొన్నారు.

ప్రతిపక్ష నాయకులపై కేసులు పెడుతున్నారంటూ ఆరోపణ

ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేస్తున్నారని, పోలీసుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారని గుజ్జ సంపత్‌రెడ్డి ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలను ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల తరఫున గళమెత్తే నాయకులను అణచివేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.

పట్టభద్రుల ఎన్నికలపై బీఆర్ఎస్ ప్రచారం

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించేందుకు కీలకమైన అవకాశమని సంపత్‌రెడ్డి అన్నారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, బీఆర్ఎస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి పట్టభద్రుడిని కలిసి ఎన్నికల ప్రాధాన్యతను వివరించాలని సూచించారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఈ సమావేశంలో ల్యాబర్తి గ్రామ సర్పంచ్ మన్నూరు శారద సోము, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గుడికందుల రాజు, సీనియర్ నాయకులు కర్రె కొమురయ్య, మాజీ ఎంపీటీసీ అన్నమనేని ఉమాదేవి, బీఆర్ఎస్ వార్డు సభ్యులు, ఉమ్మడి ల్యాబర్తి ముఖ్య నాయకులు, పట్టభద్రులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పెద్దపల్లి జిల్లా/ మంథని, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి):ప్రజలకు మేలు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి, సాగునీటి ప్రయోజనాల సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.
మంథని పట్టణంలో మంగళవారం పర్యటించిన మంత్రి, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల వికాస ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

స్వామివారి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

బ్రహ్మశ్రీ గణపతి సచ్చిదానంద సరస్వతి స్వామివారు నవంబర్ 1న మంథని పట్టణానికి రానున్న నేపథ్యంలో, అయ్యగారి చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌తో పాటు ఇతర ఏర్పాట్లను మంత్రి శ్రీధర్‌బాబు పరిశీలించారు. స్వామివారి రాక సందర్భంగా భక్తులకు దివ్యాశీస్సులు అందేలా పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురు ప్రముఖులను, మంథని పట్టణానికి చెందిన పెద్దలను స్వయంగా ఆహ్వానించి నట్లు వెల్లడించారు. నవంబర్ 1న మధ్యాహ్నం స్వామివారు దత్తాత్రేయ స్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం మంథని ప్రాంత భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు అందించడంతో పాటు, భక్తులకు దివ్యాశీస్సులు అందించేందుకు శివకిరణ్ గార్డెన్స్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.
ప్రాంత ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులందరూ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని మంత్రి కోరారు.

మూడు బ్యారేజీలతో ఒక్క ఎకరాకూ నీరు అందలేదు: శ్రీధర్‌బాబు

అనంతరం విలేకరులతో మాట్లాడిన మంత్రి, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు, బ్యారేజీల నిర్మాణం, గత ప్రభుత్వ విధానాలపై స్పందించారు. గతంలో సాంకేతిక కారణాలు, నది పరివాహక ప్రాంత పరిస్థితులు, ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో మూడు బ్యారేజీల నిర్మాణం చేపట్టారని వివరించారు.
ఈ బ్యారేజీల నిర్మాణం వల్ల ఆయా ప్రాంతాల్లో ప్రజలు భూములు, ఇళ్లు, జీవనోపాధి మార్గాలను కోల్పోయినప్పటికీ, వాటి ద్వారా ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందలేదని మంత్రి విమర్శించారు. ఈ పరిస్థితికి ఆయా ప్రాంతాల ప్రజలే సాక్షులని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు సంబంధించిన అంశాలపై మహారాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి సరైన సమాధానం చెప్పలేకపోతున్నారని ఆరోపించారు.
ప్రజా ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టుల కార్యాచరణను అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నప్పటికీ, ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ, సాగునీటి ప్రయోజనాలను సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు గౌతమ్ కృష్ణ ఎంపిక

- **ములుగులో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టులో చోటు**

హనుమకొండ, అక్టోబర్ 27 (నిత్యం నిఘా ప్రతినిధి): కమలాపురం మండలం గూడూరు గ్రామానికి చెందిన తెప్ప స్వామి కుమారుడు తెప్ప గౌతమ్ కృష్ణ రాష్ట్రస్థాయి అండర్-17 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల ములుగులో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జట్టులో చోటు సంపాదించాడు.ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పాఠశాల క్రికెట్ పోటీల్లో గౌతమ్ కృష్ణ పాల్గొననున్నాడు. ప్రస్తుతం హనుమకొండ నక్కలగుట్టలోని జయభారతి కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న గౌతమ్ కృష్ణ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో క్రికెట్‌లో మరింత రాణించాలని ఆకాంక్షిస్తున్నారు.



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ములుగు జిల్లా /తాడ్వాయి, అక్టోబర్ 27(నిత్యం నిఘా ప్రతినిధి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల మాయమాటలు నమ్మి ఆన్‌లైన్ మోసాల బారిన పడవద్దని ఎస్సై అచ్చ కమలాకర్ సూచించారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కోకిన్ ఆదేశాల మేరకు తాడ్వాయి మండల పరిధిలోని మేడారం గ్రామంలో సైబర్ నేరాల నివారణపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యువకులను ఒకచోట చేర్చి, వారి చేతుల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించే పోస్టర్లను అందజేసి ప్రజలను అప్రమత్తం చేశారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం వల్ల ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందని, ఇతరులకు ఓటీపీలు తెలియజేస్తే బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు క్షణాల్లో ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

సైబర్ మోసం జరిగితే 1930కు ఫోన్ చేయాలి

ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని స్పష్టం చేశారు.
సైబర్ నేరానికి గురైనట్లు అనుమానం వచ్చినా, మోసం జరిగినా ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణ కవచమని పేర్కొన్నారు.

యువత సైబర్ సైనికులుగా మారాలి

యువత సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకుని, ఈ సమాచారాన్ని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి చేరవేయాలని ఎస్సై పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, సైబర్ నేరాల నివారణలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు.
ప్రజలు, పోలీసులు సమన్వయంతో ముందుకు సాగితే ఎలాంటి సమస్యనైనా సమర్థంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. ప్రజల భద్రత కోసం పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో పోలీసులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

రాబోయే 2-3 రోజులలో చేపల వేటకు వెళ్లకూడదు
: మత్స్య శాఖ సహాయ సంచాలకులు మల్లేశం

నిత్యం నిఘా, ఖమ్మం, అక్టోబర్ 27 : తెలంగాణ వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, రాబోయే రెండు మూడు రోజులలో బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం "ఆర్నబ్" తుఫాన్‌గా మారి అతివేగవంతమైన ఈదురుగాలులతో ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లాలోని మత్స్యకారులు రిజర్వాయర్లలో, వాగులలో చేపల వేటకు వెళ్లరాదని మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఏ. మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే రెండు మూడు రోజులలో జిల్లాలో కురిసే భారీ వర్షాల వల్ల నదులు, వాగులు, వంకలలో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని, రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున, చేపల వేటకు వెళితే ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని, కావున జిల్లాలోని మత్స్యకారులు ఎవరూ ప్రాణాపాయ పరిస్థితుల్లో రిజర్వాయర్లు, వాగులు, చెరువులలో చేపల వేటకు వెళ్లరాదని మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జాతీయస్థాయి నృత్యోత్సవ పోటీలలో స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విద్యార్థిని వి.రేష్మిత ప్రథమ బహుమతి కైవసం



నిత్యం నిఘా, ఖమ్మం, అక్టోబర్ 27 : స్థానిక శ్రీనగర్‌కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ విద్యార్థిని వి.అశోక్ కుమార్, సౌజన్యల కుమార్తె వి.రేష్మిత. శ్రీ శివసాయి కూచిపూడి నృత్య కళాక్షేత్రం రాజమహేంద్రవరం వారు నిర్వహించిన భరతనాట్య విభాగంలో పాల్గొని తన నృత్యంతో అలరించడమే కాకుండా అసాధారణ ప్రతిభతో భరత నాట్యం జూనియర్స్ వ్యక్తిగత, గ్రూప్ విభాగాలలో జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతులను సాధించి నృత్య కళాక్షేత్రం వారిచే గోల్డ్‌మెడల్ సర్టిఫికెట్స్ లతో పాటు ఘనమైన సత్కారాన్ని పొంది సత్తా చాటింది. ఈ అభినందన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్స్ కొండా శ్రీధర్ రావు, కృష్ణవేణి లు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యం నుండే విద్యతో పాటు వివిధ కళలపై ఉన్న ఆసక్తికి అనుగుణంగా వారికి నిష్ణాతులైన మాస్టర్స్‌చే నైపుణ్య శిక్షణ ఇస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలియజేశారు. నాల్గవ తరగతి చదువుతున్న వి.రేష్మిత అతి చిన్న వయసులోనే జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి సాధించడం చాలా గొప్ప విషయం అంటూ భవిష్యత్తులో ఇంకా మరెన్నో విజయాలను సాధించి ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదిస్తూ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.సురేష్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని విజేతను అభినందించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సేంద్రియ వ్యవసాయ రైతు దేవబత్తిని పద్మనాభయ్యకు మాజీ ఎమ్మెల్యే

డాక్టర్ బానోతు చంద్రావతి నివాళి



నిత్యం నిఘా, ఖమ్మం, అక్టోబర్ 27 : 99 ఏళ్ల సీనియర్ సేంద్రియ వ్యవసాయ రైతు దేవబత్తిని పద్మనాభయ్య మృతి పట్ల వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోతు చంద్రావతి సంతాపం వ్యక్తం చేశారు. పద్మ నాభయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆమె, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా చంద్రావతి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ సుదీర్ఘ జీవితం గడిపిన పద్మనాభయ్య జీవన విధానం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యులు షేక్ లాల్ మహమ్మద్, వాసిరెడ్డి రవి, షేక్ మైసూర్, ఇలూరి భూపతి రెడ్డి, నునావత్ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, షేక్ సోంధ్ సాయబ్, షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలపై చేపడుతున్న ధర్నాకు మద్దతుగా తోకల శ్రీనివాస్ రెడ్డి

- **ఖమ్మం, కొత్తగూడెం, కూసుమంచిలో రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు**
- **ఉభయ జిల్లాల్లో పలు సేవా కార్యక్రమాలకు శ్రేణుల సన్నద్ధం**

నిత్యం నిఘా, ఖమ్మం, అక్టోబర్ 27 : రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం రోజున ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు.ఇందులో భాగంగా ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం 8:30 గంటలకు తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. కూసుమంచి లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉదయం 9:30 గంటలకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అక్కడ కూడా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కూసుమంచి ప్రధాన కూడలి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించేం దుకు ఏర్పాట్లు చేశారు.ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మంత్రి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మంత్రి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా నేడు ఐఎఫ్‌డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

- **పండ్ల పంపిణీ, కేక్ కటింగ్, మొక్కలు నాటడం తదితర సామాజిక సేవా కార్యక్రమాలు**



నిత్యం నిఘా, ఖమ్మం, అక్టోబర్ 27 : దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న జాతీయ జర్నలిస్టుల సంఘం ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను అక్టోబర్ 28న ఖమ్మంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నానాబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అరవపల్లి నగేష్ తెలిపారు.1950 అక్టోబర్ 28న ఢిల్లీలో స్థాపించబడిన ఐఎఫ్‌డబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరిం చుకుని దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలోనూ వేడుకలను సామాజిక సేవా కార్యక్రమా లతో నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌లో ఉదయం 11 గంటలకు పేదలకు, రోగులకు పండ్ల పంపిణీ, కేక్ కటింగ్, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్న లిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు సమాజ సేవకు ప్రాధాన్యతనిస్తూ ఈ కార్యక్రమా లను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్టులు, ఫెడరేషన్ నాయకులు, సభ్యులు, ప్రజాసేవపై ఆసక్తి ఉన్నవారు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని నానబాల రామకృష్ణ, అరవపల్లి నగేష్ పిలుపునిచ్చారు.

చరిత్ర, ప్రకృతి అందాల నడుమ ఓరుగల్లు పరపతి సంఘం విహారయాత్ర

- **సింధుదుర్గ్‌లో మూడు రోజుల సందడి.. సభ్యుల సంక్షేమం, సంఘం అభివృద్ధిపై సర్వసభ్య సమావేశంలో చర్చ**



వరంగల్, అక్టోబరు 27 (నిత్యం నిఘా ప్రతినిధి): విజ్ఞాన, వినోదాల మేళవింపుగా ఓరుగల్లు పరపతి సంఘం చేపట్టిన మూడు రోజుల మహారాష్ట్ర విహారయాత్ర మంగళవారం ఉత్సాహంగా ముగిసింది. మహారాష్ట్రలోని చారిత్రక సింధుదుర్గ్ ప్రాంతంలో సముద్ర తీర అందాలు, పురాతన ఆలయాలు, మరాఠా చక్రవర్తి ఛత్రపతి శివాజీ నిర్మించిన కోటను సందర్శించిన సభ్యులు ఆనందంగా గడిపారు. యాత్రలో భాగంగా సంఘం సర్వసభ్య సమావే శాన్ని నిర్వహించి, సభ్యుల సంక్షేమం, సంఘం ఆర్థిక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.గత ఆదివారం హైదరాబాద్ నుంచి విమానంలో సింధుదుర్గ్ చేరుకున్న సంఘం సభ్యులు తర్కార్లి దేవ్‌బాగ్‌లో అరేబియా సముద్రం ఒడ్డున ఉన్న విడిది కేంద్రంలో బస చేశారు. ఆటపాటలతో సందడి చేస్తూ, తెలంగాణ పాటలకు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు.రెండో రోజు ఉదయం స్థానిక సముద్ర తీరంలో స్నానాలు చేసిన అనంతరం దేవ్‌గఢ్‌కు బయలుదేరారు. కొంకణ్ తీరంలో సుమారు 900 ఏళ్ల చరిత్ర కలిగిన కుంకేశ్వర్ ఆలయాన్ని దర్శించుకు న్నారు. సముద్ర తీరాన కొండపై వెలసిన మహా దేవుడిని దర్శించుకుని పలువురు సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవ్‌గఢ్ పార్కును సందర్శించి అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించారు.ఆ తర్వాత పడవల్లో అరేబియా సముద్రంలోకి వెళ్లి, 17వ శతాబ్దంలో ఛత్రపతి శివాజీ నిర్మించిన చారిత్రక సింధుదుర్గ్ కోటను సందర్శించారు. సముద్ర మార్గంలో శత్రు దాడులను ఎదుర్కొనే వ్యూహంతో నిర్మించిన ఈ కోట నిర్మాణ శైలి, చారిత్రక విశేషాలు సభ్యులను ఆకట్టుకు న్నాయి. కోటలో మంచినీటి అవసరాల కోసం నిర్మించిన దూద్ బావి, దహి బావి, శక్కర్ బావి, కోనేరుతో పాటు శివరాజేశ్వర్, భవానీ మాత ఆలయాలను సందర్శించారు. అక్కడి శివాజీ జెండాను వీక్షించారు.అనంతరం రాజ్‌కోట్‌లోని 91 అడుగుల భారీ ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని సందర్శించి జై శివాజీ నినా దాలతో సందడి చేశారు. యాత్రలో అడుగడు గునా అరేబియా సముద్రపు అందాలు సభ్యులను మంత్రముగ్ధులను చేశాయి.మూడో రోజైన మంగళవారం సంఘం డైరెక్టర్ల నేతృత్వంలో తర్కార్లి దేవ్‌బాగ్‌లోని విడిది కేంద్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. సంఘం సభ్యుల సంక్షేమం, ఆర్థిక అభి వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం సింధుదుర్గ్‌కు వీడ్కోలు పలికిన సభ్యులు విమానంలో తిరుగు ప్రయాణమయ్యారు. మంగళవారం సాయంత్రం వరంగల్‌కు చేరు కున్నారు.ఈ విహారయాత్రలో సంఘం డైరెక్టర్లు మందా శ్రీనివాస్, కత్తెరశాల వేణుగో పాల్, గాదె మధుసూదన్, ముష్కమల్ల సుధాకర్, పాలకుర్తి వేణుగోపాల్‌తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.వరంగల్ ప్రాంతానికి చెందిన ఓరుగల్లు పరపతి సంఘంలో వివిధ వర్గాలకు చెందిన సభ్యులు కొనసాగుతున్నారు. పాదుపు, రుణ వితరణ ద్వారా సభ్యుల ఆర్థిక అవసరాలకు తోడ్పడ టంతో పాటు, రెండేళ్లకోసారి విజ్ఞాన, విహార యాత్రలను నిర్వహిస్తూ సభ్యుల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నారు.

ఉమ్మడి వరంగల్ పర్యాటక సర్క్యూట్‌కు జాతీయ స్థాయి గుర్తింపు


- **ది వీక్ హెరిటేజ్ అవార్డ్స్–2026’లో సిల్వర్ బన్యన్ పురస్కారం**
- **కాకతీయ వారసత్వం, రామప్ప ఆలయం, లక్నవరం, బొగత జలపాతానికి దక్కిన గౌరవం**



నిత్యం నిఘా, న్యూఢిల్లీ, అక్టోబరు 27 : తెలంగాణ పర్యాటక రంగానికి మరో విశిష్ట గుర్తింపు లభించింది. వరంగల్, హనుమకొండ, ములుగు ప్రాంతాలతో కూడిన పర్యాటక సర్క్యూట్‌కు ప్రతి ష్ఠాత్మక ‘ది వీక్ హెరిటేజ్ అవార్డ్స్–2026’లో హెరిటేజ్ టూరిజం విభాగం కింద ‘బెస్ట్ టూరిస్ట్ సర్క్యూట్ / బెస్ట్ టూరిస్ట్ ట్రైల్’ విభాగంలో సిల్వర్ బన్యన్ పురస్కారం లభించింది. మంగళవారం న్యూఢిల్లీలోని తీన్‌మూర్తి మార్గ్‌లో ఉన్న ప్రధాన మంత్రి మ్యూజియం, గ్రంథాలయంలో నిర్వహిం చిన కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈ పురస్కారాన్ని అందజే శారు.తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్వహణ సంచాలకురాలు వల్లూరు క్రాంతి మార్గద ర్శకత్వంలో రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వారస త్వాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు చేపడు తున్న కార్యక్రమాలకు ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచింది.చారిత్రక కాకతీయ సామ్రాజ్య వైభవం, ప్రాచీన దేవాలయాలు, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప ఆలయం, లక్నవరం సరస్సు, బొగత జలపాతం, గిరిజన సంస్కృతి, చేనేత సంప్రదాయాలను ఒకే పర్యాటక మార్గంలో అనుసంధానించడం ఈ సర్క్యూట్ ప్రత్యేకత. చరిత్ర, ఆధ్యాత్మికత, ప్రకృతి అందాల సమ్మేళనంగా పర్యాటకులను ఆకర్షిస్తున్న ఈ ప్రాంతానికి అవార్డు లభించడం ప్రాధాన్యం సంతరించుకుంది.కాకతీ యుల రాజధానిగా వెలుగొందిన వరంగల్ ఈ పర్యాటక సర్క్యూట్‌కు ప్రధాన కేంద్రంగా ఉంది. వరంగల్ కోట, కాకతీయ కళాతోరణం, వేయి స్తంభాల దేవాలయం, భద్రకాళి ఆలయం వంటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలు నాటి నిర్మాణ కళా వైభవానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి.ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయం ఈ సర్క్యూట్‌లో మరో ప్రధాన ఆకర్షణ. యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన ఈ ఆలయం కాకతీయ శిల్పకళా నైపుణ్యానికి, అద్భుతమైన రాతి చెక్కడాలకు, వినూత్న నిర్మాణ శైలికి ప్రసిద్ధి చెందింది. ఆలయ నిర్మాణంలో ఉపయోగించిన తేలికపాటి ఇటుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలు స్తున్నాయి.లక్నవరం సరస్సు, దాని దీవులు, సస్పెన్షన్ వంతెన, బోటింగ్ సౌకర్యాలు ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పచ్చని అడవుల మధ్య జాలువారే బొగత జలపాతం పర్యాటకులకు కనువిందు చేస్తోంది. తెలంగాణ నయాగరాగా పేరొందిన ఈ జలపాతం ఈ పర్యాటక మార్గానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.పర్యాటకులకు మెరుగైన అనుభూతిని అందించేందుకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ వివిధ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. హరిత హోటళ్లు, విడిది కేంద్రాలు, లక్నవరం వద్ద బోటింగ్ సౌకర్యాలు, రవాణా అను సంధానం, పర్యాటక ప్రాంతాల సమాచార వ్యవ స్థలను మెరుగుపరచడంతో పాటు వరంగల్, రామప్ప ఆలయం, లక్నవరం, బొగత జలపాతా లను అనుసంధానిస్తూ ప్రత్యేక పర్యాటక ప్యాకేజీ లను రూపొందిస్తోంది.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ‘తెలంగాణ జారూర్ ఆనా’ ప్రచార కార్యక్రమం ద్వారా ఈ ప్రాంతాల ప్రత్యేకతలను దేశీయ, అంత ర్జాతీయ పర్యాటకులకు పరిచయం చేస్తున్నారు. చారిత్రక సంపద, ప్రకృతి అందాలు, స్థానిక సంస్కృతి, గిరిజన సంప్రదాయాలు, చేనేత కళలను ప్రపంచానికి చాటిచెప్పడమే ఈ ప్రచార లక్ష్యంగా కొనసాగుతోంది.ఉమ్మడి వరంగల్ పర్యాటక సర్క్యూట్‌కు లభించిన సిల్వర్ బన్యన్ పురస్కారం ఈ ప్రాంతానికి పర్యాటకంగా మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు స్థానికంగా పర్యాటక రంగం అభివృద్ధికి దోహదపడనుంది. చారిత్రక కట్టడాల పరిరక్షణ, ప్రకృతి వనరుల సంరక్షణ, స్థానిక సంస్కృతికి ప్రోత్సాహం కల్పిస్తూ పర్యాటక సదుపాయాలను విస్తరించేందుకు ఈ గుర్తింపు మరింత ప్రేరణగా నిలవనుంది.

బాణాసంచా విక్రయాలకు తాత్కాలిక అనుమతుల కోసం నవంబర్ 2వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి

: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



నిత్యం నిఘా, ఖమ్మం, కొత్తగూడెం, అక్టోబర్ 27 : రానున్న దీపావళి పండుగ సందర్భంగా జిల్లాలో తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అనుమతులు కోరే వారు, అవసరమైన ధ్రువపత్రాలతో కూడిన పూర్తి దరఖాస్తులను నవంబర్ 2వ తేదీలోపు సంబంధిత డీఎస్పీ కార్యాలయాల్లో సమర్పించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.దరఖాస్తుతో పాటు అగ్నిమాపక శాఖ జారీ చేసిన నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్ ఓ సి), స్థల యజమాని లేదా సంబంధిత ప్రభుత్వ అధికారి నుంచి పొందిన అనుమతి పత్రం, జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, గతంలో లైసెన్స్ పొందినట్లయితే దాని ప్రతిని జతచేయాలని సూచించారు. అవసరమైన చోట్ల పక్క స్థలాల యజమానుల అనుమతి పత్రాలు, విక్రయ కేంద్రానికి సంబంధించిన బ్లూప్రింట్ (సైట్ ప్లాన్)ను కూడా సమర్పించాలని తెలిపారు.అదేవి ధంగా, ప్రభుత్వ ఖజానాకు నిర్ణీత రుసుము చెల్లించినట్లు ధ్రువీకరించే బ్యాంకు చలాన్‌ను దరఖాస్తుతో పాటు జతచేయాలని పేర్కొన్నారు.సమ ర్పించిన దరఖాస్తులను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా సంబంధిత డీఎస్పీ స్థాయి అధికారులు అనుమతులు జారీ చేస్తారని ఎస్పీ తెలిపారు. అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, వ్యాపారులు నిబంధనలను తప్ప నిసరిగా పాటించాలని సూచించారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com